ముషీర్

# చిన్నయ్య




పూర్వం రంగాపురం అనే వో గ్రామంలో చిన్నయ్య అనే వో యువకుడుండేవాడు. వాడికి తాతతండ్రులు సంపాదించినఆస్తంటూ ప్రత్యేకంగా ఏమీ లేకపోయినా, స్వయం కృషితో, తెలివితేటలతో యుక్త వయస్సు వచ్చేసరికి నానా రకాల వ్యాపారాలు చేసి బాగా ధనం కూడబెట్టాడు. ఆ తర్వాత వచ్చిన వో అమ్మాయిని పెళ్లి చేసుకుని హాయిగా కాపురం చేస్తూ వచ్చాడు.

ఇలా ఉండగా, వోనాడు "చిన్నయ్య" ఇంటి ప్రక్క వీధిలో వో ముసలాయన కాస్తా గుటుక్కుమన్నాడు. దాంతో చిన్నయ్యకు మనసులో వారు మూల వో భయం లాంటిది చేరుకుంది. ఇంత అందమైన జీవితం ఇచ్చి ఇన్ని ఆనందాల్ని ఈ లోకంలో నింపి, అన్నీ ఇచ్చినట్లే ఇచ్చి, చంపేయటం అన్నది దేవుడు ఈ ప్రాణికోటికి చేస్తున్న తీరరాని ద్రోహం అనిపించింది చిన్నయ్యకు మర్నాడే వాడెవరికీ చెప్పకుండా అడవి కెళ్లిపోయి, ఘోరంగా తపస్సు చేయసాగాడు. కొన్నాళ్లకు భగవంతుడు ప్రత్యక్షమై "ఏమిటి నీ కోరిక?" అన్నాడు.

అందుకు చిన్నయ్య, "చావు లేకుండా చెయ్యి" అన్నాడు.

అందుకు దేముడు నవ్వి, "పిచ్చివాడా! పుట్టడం, పెరగటం, గిట్టటం అన్నది ప్రాణి కోటి లక్షణం. యవ్వనంలో వున్నావు గనక నీ కిప్పుడంతా అందంగా ఆనందంగానే కన్పిస్తుంది. అయినా అడిగావు కనక, నువ్వు కోరుకున్నప్పుడే నీకు చావు వచ్చేట్లు అనుగ్రహిస్తున్నా" అని చెప్పి అంతర్ధానమైపోయాడు.

చిన్నయ్య ఆనందంతో పొంగిపోతూ ఇంటికి తిరిగి వచ్చేసరికి అతని భార్య లేదు. పాము కాటువల్ల వారం రోజుల క్రితమే చనిపోయింది. చిన్నయ్యకు మొదటి సారిగా పెద్ద అఘాతంలా తగిలింది. భార్య లేకుండా బ్రతకటం కష్టం అనిపించింది. అయినా గుండె రాయి చేసుకుని, పిల్లల్ని పెంచసాగాడు.

కాలం గడుస్తున్నకొద్దీ పిల్లలు పెరిగి పెద్దవారయ్యారు. వాళ్లకు పెళ్లిళ్లు అయినాయి. వాళ్లకు పిల్లలు పుట్టుకొచ్చారు. చిన్నయ్య ఈడు వాళ్లంతా ఒక్కొక్కరే రాలిపోసాగారు. తన అనుకున్న వాళ్లంతా ఒక్కొక్కరే వెళ్లిపోతుంటే, ఎంత నరక యాతనగా ఉంటుందో స్వయంగా తెలుసుకున్నాడు చిన్నయ్య.

కాలం గడిచిపోతుంది. తరం మారింది. వేషాలు మారాయి. పద్ధతులు మారాయి. చిన్నయ్య పిల్లలు కూడా చనిపోయారు. మనవళ్లకు పెళ్లిళ్లయాయి. ముని మనవలు...ముని మునిమనవలు పుట్టుకొచ్చారు. అయినా చిన్నయ్య చావలేదని ఎవరూ చిన్నయ్యను లెక్కచేసేవాళ్లు కారు... ఏ మాట చెప్పబోయినా ఏం చేయబోయినా, "నీకేం తెలకాదు. నీదంతా పాత కాలం. ఆ మూలన పడివుండు" అంటూ, పట్టించుకోవటమే మానేశారు.

వో రోజు చిన్నయ్య చెట్టు క్రింద కూర్చుని ఉంటే ముని ముని మనవడి కొడుకు తల్లితో చిన్నయ్యను చూపిస్తూ "ఆయనెవరమ్మా?" అనడిగాడు. అందుకామె చీదరించుకుంటూ, "మన ఇంటి పాలిటి దెయ్యం. అందరూ చచ్చిపోతుంటే చూస్తూ కూర్చోటానికి పుట్టాడు" అంది ఈసడింపుగా.

ఈ మాటల్ని తట్టుకోలేకపోయాడు చిన్నయ్య. ఆ రోజే తనువు చాలించాడు. *

## బ్రహ్మదేవుడి సలహా

పొరబాటున వరు డొకండు
తొడనుకొని తాచుపాము
నడ్డిమీద నడ్డముగా
అడుగువేసి నడిచిపోయె.

పట్టరాని బాధతోడ
కొట్టుకొనుచు, చుట్టుకొనుచు
చెంతనున్న చింతచెట్టు
తొర్రలోన దూరె పాము.

కుర్రవాళ్ళు కొంతమంది
తొర్రనుండి తోకబట్టి
దాని పీడ్చి తల కిందుగ
వేలగట్టి రూపుమాప.

తప్పించుక తాచుపాము
తుప్పలలో దూరిపోవ
ఆ తుప్పల కగ్గి పెట్టి
రాకతాయి మూక చేరి.

ఈ రీతిగ నెంతమంది
ఎన్ని గతుల హింసించిన
ఉమ్మ మనదు బుస్స మనదు
శాంతమూర్తి కాలనాగు.

ఆ నర్పము చిట్ట చివర
కలిసిపోయి విసిగిపోయి
సృష్టికర్త నద్ద కేగి
కష్టాలను విన్నవించె.

బ్రహ్మదేవు డంతా విని
పాముకి హితబోధ చేసె
"వెర్రిదాన! నీ నోటికి
విషపు కోర లెందు కిస్తి?

"ముట్టుకున్న వారినెల్ల
పట్టి కాటు వేసి చూడు
భయభక్తులు, నవేద్యాలు
కొలుపులు నీ కమరుచుండు."

- డాక్టర్ మహీధర
నళినీమోహన్